# అమ్మాయి అలిగింది

-అమ్మిన శ్రీనివాసరాజు

ఉదయపు కార్యక్రమాలు పూర్తిచేసుకుని ముఖ్యమైన వ్యక్తి కోసం చూస్తున్నట్లుగా రోడ్డువైపు పదే పదే పరికించి చూస్తున్నారు పరంధామయ్య.

జారుతున్న కళ్లద్దాలు సరిచేసుకుంటూ పడక కుర్చీలో కూర్చున్న పరంధామయ్య ముతక ఖద్దరు పంచెపైన అదేతీరు బనీలు ధరించి ఎర్రగా బక్కపల్చగా ఆరుపదులు దాటిన ఆయన ప్రతిరోజూలాగే ఆరోజు కూడా ఎదురు చూస్తుంది తన ప్రాణ స్నేహితుడు రాజారావు కోసం!

సంఘంలోని మంచి చెడుల మధ్య సంఘర్షణ. జీవితంలో అనుకోకుండా ఎదురయ్యే సమస్యలు మనసుల్ని కదిలించివేసినపుడు తన మమకారంతో మనశ్శాంతిని అందించే నిజమైన స్నేహితుడు అలాంటి ఆత్మీయ మిత్రుడే రాజారావు.

ప్రతిరోజూ ఉదయం పూజ ముగించుకుని ముందు హాలులో పడక కుర్చీలో కూర్చుని పేపరు చదువుతుండటం ఈలోగా రాజారావ్ రావడం వాళ్లిద్దరికీ పరంధామయ్య గారి భార్య పార్వతమ్మ టిఫెనూ - టీ అందించడం ఇక అప్పటినుండే పదకొండు అయ్యేదాకా స్నేహితులిద్దరి మధ్యా సమకాలీన రాజకీయాలు సాహిత్యం కళలు మీద చర్చలు కొనసాగుతుండేవి. సాధారణంగా వారి చర్చల్లో కుటుంబ సమస్యలు గాని అంతరంగిక వ్యవహారాలు గాని ప్రవేశించేవి కావు!

ఆరోజు పేపరు చదువుతూ కూర్చున్న పరంధామయ్య దగ్గరకు ఓ పాతికేళ్ల కుర్రాడు వచ్చి ఎంతో వినయంగా "నమస్కారం సార్..." అన్నాడు ప్రతి నమస్కారం చేసి ఏమిటన్నట్టు చూసారు. "... మరేం లేదండీ మీతో కాస్త పనుండి వచ్చాను..." అన్నాడు తడబడుతూనే. "ఫరవాలేదు ఏంటో చెప్పు?!" అన్నారు మృదువుగా.

"నేను సుబ్బారావుగారి అబ్బాయి ప్రసాద్‌ని..." అన్నాడు ఇంకా ఏదో చెప్పబోయినట్లుగా..." "అలాగా నిన్ను ఎప్పుడో చూసినట్లుందే! ఇంతకీ ఏం చేస్తున్నావ్?" ఆసక్తిగా మందహాసంతో అడిగారు. "డిగ్రీ పూర్తిచేసి బి.ఇడి. చేస్తున్నానండీ..." చెప్పాడు ఎంతో వినయంగా. "శభాష్... ఇంతకీ పనేంటో" అన్నారు.

"మరేం లేదండీ రాజారావ్ గార్కి మీకు మంచి స్నేహమని తెలిసింది అందుకే మీ దగ్గరకు వచ్చాను" అన్నాడు ధైర్యం కూడగట్టుకుని.

"రాజారావుకీ నాకూ వున్న స్నేహానికి నీకు పనేంటి?" అన్నట్లు చూసారు అర్థంగాక. "ఇంతకీ పనేంటో చెప్పావ్ కాదు" అన్నారు తొందర చేస్తున్నట్లు.

"మరేం లేదండి రాజారావు గారి అమ్మాయి స్వాతి, నేను పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాం. మా కుటుంబం గురించి మీకు అంతా తెలుసు. మీరు కొంచెం నా గురించి మా కుటుంబం- గురించి ఆయనకు చెప్పి ఒప్పించాలి" అన్నాడు ప్రాధేయపడుతున్నట్టుగా..

"అయితే నువ్వా అమ్మాయిని ప్రేమిస్తున్నావన్నమాట! అసలు విషయం చెప్పొచ్చుకదా ఈ డొంక తిరుగుడు రాజకీయం దేనికీ!?" అన్నారు కొంచెం కోపం మరి కొంచెం ఆశ్చర్యం కలగలిపి.

"మీరు ప్రేమించుకుని పెళ్లి చేసుకోవాలనుకొంటే మధ్యలో నా ప్రమేయం దేనికి? నువ్వే ఆయన్ను అడగొచ్చుగదా?!"

"అది కాదండీ ఆయన కొంచెం కోపకారి మనిషి నన్ను సరిగా అర్థం చేసుకోక కోపంలో ఏదైనా నిర్ణయం తీసుకుంటే నా జీవితమేం కావాలి?" అన్నాడు భయపడుతూ.

"వ్యవహారం చాలా దూరం వెళ్లిందన్నమాట... కాని రాజారావ్ గురించి నాకు బాగా తెలుసు ఈ వ్యవహారానికి సరితూగడేమో అనిపిస్తుంది" అన్నారు.

"ఎలా అయినా మీరే ఒప్పించాలి మీకు తప్ప మరెవ్వరికీ సాధ్యపడదు" అన్నాడు జాలిగా మొహం పెట్టి. "నిజమేగాని... ఆయన టీచర్‌గా పనిచేసి రిటైరయ్యి సాయంతం పూట ఏదో చిన్నపిల్లలకు

## ఎజెండా

గజం గజంకీ
ఇజం ఎజెండాలు
మానవత్వానికి
లేనేలేవా జెండాలు?

-ఈగ హనుమాన్

ట్యూషన్లు చెప్పుకుంటూ గుట్టుగా కాపురం కదిలించుకుపోతున్నాడు. మీ నాన్నగారేమో పెద్ద కాంట్రాక్టర్ ఈ మధ్యే దాబా కూడా కట్టినట్టున్నారు. మరి మీలాంటి వారితో తను సరితూగలేదేమో!" అన్నారు పరంధామయ్య.

"మరేం పర్వాలేదండి వాళ్లు అమ్మాయిని ఇస్తే చాలు వాళ్లది సాంప్రదాయక కుటుంబమని అమ్మాయి బుద్ధిమంతురాలని అన్ని విషయాలు మా ఇంట్లో చెప్పాను. మిగతా విషయాలు గురించి ఏం పట్టించుకోరు" అన్నాడు ఎంతో సులువుగా.

"మరి ఆయన కానీ కట్నం ఇవ్వలేడు" అన్నారు.

"నాకు పైసా కట్నం అక్కర్లేదు పెళ్లి కూడా ఎంత సింపుల్‌గా చేసినా పరవాలేదు" అన్నాడు.

"నీకు కట్నం అక్కర్లేకపోయినా మీవాళ్లు ఊరుకుంటారా? నువ్వా చదువుకున్నావు. రేపో మాపో టీచర్ కాబోతున్నావ్" అన్నారు అసలు విషయం బయటపెడుతూ.

"మా వాళ్లను ఒప్పించే పూచీ నాదండి నా పెళ్లి విషయంలో కట్నాల విషయంలో ఏమీ కలగజేసుకోవద్దని మా ఇంట్లో ముందే చెప్పాను. అందుకు వాళ్లు ఒప్పుకున్నారు" అన్నాడు.

"అయితే చెప్పి చూద్దాం నీ అదృష్టం" అన్నారు. అభయమిస్తున్నట్టు. ఏం చేసినా మీరేదిక్కు అన్నట్లు అక్కడినుండి వెళ్లాడు ప్రసాద్.

ప్రసాద్ గురించి తెలిసిన నలుగుర్నీ ఆరాతీస్తే చాలా మంచివాడని ఎలాంటి చెడు తిరుగుళ్లు.. అలవాట్లు లేవని తెలిసింది. నిజానికి రాజారావు కూతురు స్వాతికి ఈ సంబంధం కుదిరితే అదృష్టమే!

రాజారావుకి ఆలస్యంగా అయిన పెళ్లికి సాక్షిగా అబ్బాయి- అమ్మాయి కలిగారు. అబ్బాయి రఘు డిగ్రీ చదువుతున్నాడు అమ్మాయి స్వాతి ఇంటర్ ఆఖరి సంవత్సరం చదువుతుంది. చక్కని రూపవంతురాలు. బహుచక్కని గుణవంతురాలు. స్వాతి కాలేజీకి వెళ్లే దార్లోనే ప్రసాద్ వాళ్ల ఇల్లు కావడంతో ప్రసాద్ కళ్లల్లో స్వాతి సోయగం చిక్కుకుంది. ఆ చూపుల పర్యవసానమే ఈ పెళ్లి రాయబారానికి నేపథ్యం.

యథాలాపంగా... ఆ మర్నాటి ఉదయాన్నే ప్రాణస్నేహితుల సమావేశం ప్రారంభమైంది. మాటల మధ్యలో ప్రసాద్ ప్రస్తావన తీసుకొచ్చారు పరంధామయ్య.

"పెళ్లి అయ్యేదాకా అలాగే అంటారు. తీరా పెళ్లి అయ్యాకా అది తీసుకురాలేదు ఇది తీసుకురాలేదు అంటూ రాచి రంపాన పెడతారు. చివరికి చంపడానికి కూడా వెనకాడరు. అలాంటివి పేపర్లో ఎన్ని వార్తలు చూడటంలేదు" అన్నారు తిరస్కారంగా రాజారావు.

"అబ్బాయి ఇంట్లో వాళ్లను ఒప్పించానంటున్నాడు కదా?!" అన్నారు మరింత రెట్టిస్తూ.

"ఎలా నమ్మాలి చదువుకున్న కుర్రాడు. ఉద్యోగం రానుంది. కట్నం వద్దంటారా?! అది లేకుండా చేస్తే చులకనగా చూడరూ... నేను కట్నం ఇవ్వను సరికదా ఇలాంటి ప్రేమ పెళ్లిళ్లు కూడా ఇష్టపడను" అంటూ ఖచ్చితంగా చెప్పేసారు రాజారావు.

"అదీ నిజమే! ఈ రోజుల్లో చదువుకున్న కుర్రాడికి కట్నం ఎలా వద్దంటారు?!" ఆ విషయమే మళ్లీ వచ్చిన ప్రసాద్‌కి చెప్పారు పరంధామయ్య. దానికి చాలా బాధపడ్డాడు ప్రసాద్. "అంతక్కాకపోతే మీరే స్వయంగా వచ్చి మా ఇంట్లో కనుక్కోండి'' అన్నాడు ప్రాధేయపడుతూ. పరంధామయ్యగార్ని ఒక్క పట్టాన వదిలేట్టు లేడు.

మరో విషయం ఏంటంటే స్వాతి కూడా ప్రసాద్‌ను ఇష్టపడుతుంది ఈ మధ్య ఇద్దరూ కలుసుకుని పెళ్లి విషయం మాట్లాడుకున్నారు కూడాను. అంతేగాక ప్రసాద్ తల్లి కూడా ఒకసారి పరంధామయ్య గారి ఇంటికొచ్చి పార్వతమ్మ గారితో చెప్పింది స్వాతి అంటే చాలా ఇష్టమని ప్రసాద్ పెళ్లి విషయంలో కట్నకానుకలు ఏమీ ఆశించడంలేదని రాజారావు గారి కుటుంబ పరిస్థితి తమకు తెలుసనీ..!!

పరంధామయ్యగారి ఇంట్లో కూడా అందరికీ ప్రసాద్ స్వాతిల పెళ్లి సబబే అనిపించింది కానీ రాజారావు నిర్ణయంలో మార్పులేదు!

ఆయనకు అనేక విధాల నచ్చచెప్పి చూసారు పరంధామయ్య చివరకు ఒకనాడు సూటిగా అడిగేసారు. "చూడు రాజారావు అసలు మీ అమ్మాయికి పెళ్లి చెయ్యదలుచుకున్నావా లేదా?" అని "అదేంటి అలా అంటావ్? ఆడపిల్లకి పెళ్లి చెయ్యకుండా ఎలా వుంటాము? కాకపోతే కాస్త మంచీ చెడూ" అని నసుగుతుంటే "ఇంతకన్నా మంచి సంబంధం ఏం తేగలవు? పిల్లాడు బుద్ధిమంతుడు. అందులోనూ బి.ఇడి. కూడా చేశాడు. రేపో మాపో ఉద్యోగం రాబోతుంది. కుటుంబం కూడా మంచి సాంప్రదాయం కలది. పిల్లను ఇష్టపడి మీ కుటుంబ పరిస్థితి చూసే కట్నకానుకలు లేకుండానే పెళ్లి

చేసుకుంటానంటున్నాడు. అమ్మాయి కూడా అబ్బాయంటే ఇష్టపడింది. నువ్వు గనుక ఇలా నానుస్తూ కూర్చుంటే వ్యవహారం చేయిదాటిపోవచ్చు. అప్పుడు చేసేదేముండదు" అని హెచ్చరించారు పరంధామయ్య. ఆయన అన్నటి రాజారావుకి అర్థమయ్యేటట్టు మళ్లీ వివరంగా చెప్పారు. "మీ అమ్మాయి కూడా మేజర్ అందుకని రేపు నీ ప్రమేయం లేకుండానే ఏ గుళ్లోనో దండలు మార్చుకున్నారంటే నలుగురిలోనూ నవ్వులపాలవుతాం!" అని వివరించారు.

దాంతో రాజారావు నిర్ణయంలో మార్పు వచ్చింది. తానే సాంప్రదాయబద్ధంగా ప్రసాద్ వాళ్ల ఇంటికెళ్లి పిల్లనిస్తామని చెప్పాడు. అనుకున్నట్లుగానే చకచకా పెళ్లి ఏర్పాట్లు జరిగాయి. అత్యంత నిరాడంబరంగా పెళ్లి కూడా జరిగిపోయింది.

పెళ్లి సమయంలో ప్రసాద్ తల్లిదండ్రులు గాని, బంధువులు గాని కట్నకానుకల విషయంలో ఎలాంటి పేచీ పెట్టలేదు.

పెళ్లైన సంవత్సరానికి ప్రసాద్‌కు డియస్సీలో నాన్ లోకల్ కోటాలో కరీంనగర్ జిల్లాలో టీచర్ ఉద్యోగం రావడం ఉద్యోగ ధర్మంగా ఆ ఊరికి వెళ్లిపోవడం అంతా చకచకా జరిగిపోయింది.

పరంధామయ్య - రాజారావుల మధ్య యథావిధిగా ఉదయపు సమావేశాలు కొనసాగుతూనే వున్నాయి. వాళ్ల చర్చల్లో ఈ మధ్య కొత్తగా కట్నాలు లేని కళ్యాణాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రాజారావు మొదటి నుంచి కట్నద్వేషి. తను తన కూతురుకి కట్నం లేకుండా పెళ్లి చేయడంతో తను జీవితంలో ఎంతో సాధించిన వాడిలా గర్వపడేవాడు. తను కట్నం ఇవ్వకపోవడమేగాక కట్నం తీసుకోను అనడంతో రాజారావు గారి అబ్బాయి "రఘు"కి ఇటీవల పెళ్లి సంబంధాలు చాలా వస్తున్నాయి. ఆడ పిల్లల తల్లిదండ్రులు పోటీలుపడి ఆశగా ఆయన చుట్టూ తిరుగుతున్నారు.

ఒకరోజు ఉదయాన్నే రాజారావు పరంధామయ్య ఇంటికి వచ్చాడు కాని రాజారావు మొహంలో ఏదో తెలియని విచారపు తెరలు అలముకున్నాయి. సాధారణంగా ఇంట్లో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆయన పట్టించుకోకు అన్నీ భార్యే చూసుకుంటుంది కాబట్టి ఆయన్ని కలవరపెట్టేది కుటుంబ సమస్య కాదు. కాని అలాంటిదే ఏదో ఒకటి అయివుంటుంది!!

ముభావంగా వున్న రాజారావును ఆరాగా ఆర్తిగా అడిగాడు పరంధామయ్య. తన ముభావానికి సంబంధించిన సమాచారంతో వున్న ఉత్తరాన్ని ఒద్దికగా చొక్కా జేబులోంచి తీసి ఆప్తమిత్రుడికి అందించి నిట్టూర్పు విడిచాడు రాజారావు. అది వాళ్ల అమ్మాయి స్వాతి వ్రాసిన ఉత్తరం!

ఉత్తరం ఆసాంతం చదివాక పరంధామయ్య గారికి సహితం కడుపంతా చేతితో కెలికినట్లయ్యింది. తల తిరిగిపోయింది. ఆ ఉత్తరంలో వారిని అంతగా బాధించిన పదాలివి. "మా ఇంటి పక్కనే ఉండే టీచర్ గార్కి ఈ మధ్యే కొత్తగా పెళ్లైంది. ఆయనకు వాళ్ల అత్తగారు రెండు లక్షల కట్నం ఇచ్చారు. ఎంచక్కా ఖరీదైన నగలు. కలర్ టీవీ, స్కూటర్ కూడా కొనిచ్చారు. మీకు మాత్రం నాకు నాలుగు అక్షింతలు వేసి పంపించారు. కానీ కట్నం లేదు కదా కనీసం మెళ్లోకి గొలుసు కూడా చేయించలేదు. అది నా దురదృష్టం! నా అదృష్టమే బాగుంటే అందరిలా మీరు కూడా నాకు మంచి కట్నం ఇచ్చి పెళ్లి కూడా ఘనంగా చేసేవారు. బోలెడు నగలు, వస్తువులు కొనిచ్చేవారు. పక్కవాళ్ల ముందు ఇలా సిగ్గుపడాల్సి వచ్చేది కాదు. నలుగురి ముందు హుందాగా వుండేది."

ఆ పదాలు మళ్లీ మళ్లీ బాధించాయి పరంధామయ్య గార్ని "ఏంటి? స్వాతేనా ఇలా వ్రాసింది. తను ఇలా ఊహిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. మనసుపడ్డవాడు మొగుడుగా దొరికాడని సంబరపడ్డానే కాని కట్నకానుకల విషయంలో ఇలా అనుకుంటుందనుకోలేదు'' అన్నారు ఆయన అయోమయంగా. అవును కట్నం లేకుండా పెళ్లిచేసుకుంటావా అని ప్రసాద్‌నే అడిగాం. అది పొరపాటు. స్వాతిని కూడా అడగాల్సింది" అన్నాడు తప్పుచేసిన వాడిలా రాజారావు. "కనీసం కుటుంబ పరిస్థితుల్ని చూసి కూడా అలా ఆలోచించడం తగునా?!" అన్నారు పరంధామయ్య.

"ఔను, కుటుంబ పరిస్థితులెలాగున్నా మనం ఏది చేయడం మానేస్తున్నాం? పెళ్లి చేసాము కదా! అలాగే కట్నం కూడా ఇచ్చి వుంటే తన పరువూ దక్కేది, నా కర్తవ్యం తీరేది'' అన్నాడు రాజారావు పశ్చాత్తాపపడుతున్నట్లు.

"అంటే పెళ్లి ఎంత ముఖ్యమో కట్నకానుకలు కూడా అంత ముఖ్యమన్నమాట. స్వాతి లాంటి వారి దృష్టిలో" అన్నారు వ్యంగ్యంగా...

అవును అన్నట్లు తలూపాడు రాజారావు.